

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 9 సంచిక : 4 పుష్పం : 6-7 05-11-2003

**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 9 ISSUE : 4

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**



ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689



PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 03-10-03, శృంగవృక్షం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

హిందువులు ముఖ్యంగా గణపతినవరాత్రులు, దేవీనవరాత్రులు ఎక్కువగాచేస్తూ ఉంటారు, విజయదశమిరోజున ముహూర్తాలు పెట్టుకోవటం, ప్రారంభోత్సవాలు చేయటం చేస్తారు. విజయదశమిరోజున చేసుకొంటే విజయం కలుగుతుందని హిందువుల నమ్మకం. మనకు కష్టాలు రాకుండా ఉండటంకోసం దుర్గను ఆరాధించమని చెపుతారు. దుర్గ అంటే కోట అనిఅర్థం, అంటే కోటలాగమనలను కాపాడుతుంది. భక్తి పేరుమీద అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి, అశాంతిలోనుండి శాంతిలోనికి, చీకటిలోనుండి మహావెలుగు లోనికి రావాలని భక్తిమార్గంలో ఉన్నవారు తపిస్తారు. ఒక రూపాన్ని ధ్యానించటం తేలిక. అరూప చింతన కష్టంకాబట్టి రూపచింతన చేస్తూ తరించటం మంచిదని భగవంతుడు గీతలో సలహా చెప్పాడు. అహంకారము లేకుండా దేహంరాదు. కొంతమందికి అహంకారం ఎక్కువ ఉండవచ్చు, కొంతమందికి తక్కువ ఉండవచ్చు. దేహం ఉండి, అహంభావన లేకుండా ఉన్నాడు అంటేవాడు బ్రహ్మజ్ఞాని అయిఉండాలి. అహంభావన తగ్గించుకోవటానికి చింతనమంచిది, ధ్యానం మంచిది. మన పూర్వజన్మ సంస్కారమునుబట్టి మన మనస్సు ఎక్కడ నిలబడుతోందో చూసుకొని ఆవిధంగా ప్రయాణంచేయాలి,

ఈ సంచికలో......


సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

03-10-2003 శృంగవృక్షం ........ 1
28-09-2003 హైదరాబాద్ ........ 8




మనం తరించటం ముఖ్యం. భక్తిపేరు మీద పని విడిచిపెట్టేస్తారేమో, భక్తి పేరు మీద ప్రపంచానికి దూరమవుతారేమో, భక్తి పేరుమీద సోమరితనం వస్తుందేమో అని ఇలా అనుకొంటూ ఉంటారు, అందుచేత భక్తి అంటే చాలా మందికి ఇష్టంలేదు. పని విడిచిపెట్టమని భగవంతుడు ఎక్కడా చెప్పలేదు. నీ దేహయాత్రకు సరిపడ పనిచేసుకొంటూ, నన్ను స్మరించుకో అని భగవంతుడు చెప్పాడు. గీతలో భగవంతుడు ఏమిచెప్పాడు అంటే నీవు పనిని విడిచిపెట్టటంకాదు, ప్రపంచాన్ని విడిచి పెట్టటంకాదు, నీవు ఈ ప్రపంచంలో ఉంటూనే ప్రపంచం తాలుక రాగద్వేషాలునీకు అంటకుండా చూసుకో అనిచెప్పాడు. ప్రపంచాన్ని విడిచిపెట్టి ఎక్కడికి పారిపోతాము, ఎక్కడికి వెళ్ళినా ప్రపంచం ఉంటుంది, సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకోకపోవటం వలన ఇటువంటివి వస్తున్నాయి. మనం ఎలాజీవించాలి అని నేర్పేది భక్తి. మనం పనిచేస్తూ పనిలేనిస్థితిని పొందాలికాని పని మానేయటం వలన పనిలేనిస్థితిని పొందలేము. మనం చేసే పని నిర్మలంగా, నిశ్చలంగా, ఏకాగ్రతతో చేస్తూఉంటే మనకు ఆధ్యాత్మికపురోగతి వస్తుంది. మేము ఇంట్లో చాలా కష్టాలు పడుతున్నాము అని చాలామంది చెపుతారు, అహంభావనను బట్టే చాలా పేచీలువస్తాయి. మనకు ఈజన్మ ఒక్కటేకాదు, మనకు పూర్వజన్మలు ఉన్నాయి, రాబోయేజన్మలు ఉన్నాయి. పూర్వజన్మలో మనం చేసిన దానినిబట్టి మనకు ప్రారబ్ధం ఏర్పడుతుంది, ప్రారబ్ధాన్ని అనుభవించేస్తే అది నశిస్తుంది. మన ఇంట్లో సభ్యులు కూడా వారి ప్రారబ్ధాన్ని బట్టి మన ఇంటిలో సిద్ధమవుతారు, జన్మాంతరాన్నిబట్టి ఆ అనుబంధం ఏర్పడుతుంది, వారికి మనకు ఎంతవరకు అనుబంధం ఉందో అంతవరకు మనం ఆ యింట్లో ఉంటాము, తరువాత ప్రాణంవిడిచిపెట్టిపోతాము. పూర్వజన్మలనుబట్టి ఈ దేహప్రారబ్ధమును భగవంతుడు నిర్ణయించాడు, అది అనుభవించేస్తేపోతుంది అనేటటువంటి విశ్వాసం కనుక మనకు ఉంటే ప్రారబ్ధం పేరుమీద మీకు వేదన తగ్గుతుంచి, రోదన తగ్గుతుంది, బాధతగ్గుతుంది. సబ్జక్టు మీకు ప్రోపర్‌గా అర్థమవ్వాలి. ప్రారబ్ధాన్ని దేహం అనుభవిస్తుంది. దేహమే అసత్యం అయినప్పుడు అది అనుభవించే ప్రారబ్ధంకూడా అసత్యమే. ఇది మనకు ప్రోపర్‌గా అర్థమయితే దుఃఖం ఇప్పడే నశిస్తుంది. కొంతమంది ఎన్నోకష్టాలు అనుభవిస్తూ కూడా పరమశాంతిగా ఉంటారు, కొంతమంది అన్నీ భోగాల మధ్యన ఉంటారు ఎప్పుడూ దుఃఖపడుతూ ఉంటారు దానికి కారణం ఆమెంటల్ మేకప్. అందుచేత మనస్సుకు శిక్షణ ఇవ్వాలి. ఒక మనిషివాడు ఎక్కువ చదివినంతమాత్రం చేత, వాడికి ఆదాయం ఎక్కువ వచ్చినంత మాత్రంచేత వాడిలో ఏదో విశేషం ఉందిఅనికాదు, వాడి మనస్సుఎలా ఉంది, వాడి ఆంతరంగిక జీవితం ఎలా ఉంది, వాడు రాగద్వేషముల నుండి విడుదలపొందుతున్నాడా, భగవదనుభవం పొందటానికి తగిన ట్రైనింగ్ పొందుతున్నాడా అది చూసుకోవాలి అంతేగాని వాడి జీతం ఎంత? వాడికులం ఏమిటి? వాడి మతం ఏమిటి? ఇవి ఏమీ అక్కరలేదు మనం ఎంతసేపు సీయింగు,

స్మెల్లింగు, టేస్టింగ్, హియరింగ్ ఈగొడవలతో ఉంటున్నాము. ఇవి అన్ని లోకానికి సంబంధించినవే. ఎప్పుడు ఏ సినిమాకు వెళదాము, కొత్తసినిమా ఏది వచ్చింది లేకపోతే ఈసెంటుబాగుందా ఆవాసన బాగుందా లేకపోతే ఉదయం రొయ్యలు తిన్నాము సాయంకాలం చేపలు తిందామా అని ఎంతసేపూ మనం ఇటువంటి గొడవలతో ఉంటూ, వీటికే పరిమితమైపోతున్నాము అంటే ఇంద్రియఆకర్షణలకు ఎక్కువగురి అవుతున్నాము, ఇంక మన మనస్సుకు అంతర్దృష్టిరాదు, అది హృదయంలోనికి వెళ్ళదు. వాడు అప్పుడే చనిపోయాడు ఏమిటి అనుకొంటాము, మనం అనుకొనేది ఏదీ నిజంకాదు. దేహము భూమి మీదకు వచ్చినప్పడే ఆదేహము ఎంతకాలం ఉండాలి, ఆదేహం ద్వారా ఏపనిజరగాలి, అది ఎప్పుడు మరణించాలి అది నిర్ణయించబడివస్తుంది. 1986వ సం॥లో నాకు జబ్బు చేసినప్పడు మీరు చనిపోతారు అని డాక్టర్లు చెప్పారు. కాని దేహప్రారబ్దం ప్రకారం ఈశవం ఇంకా కొంతకాలం ఇక్కడ ఉండవలసిఉంది, ఉంటుంది, ప్రారబ్దం పూర్తిఅయిన వెంటనే అది నశిస్తుంది. ప్రారబ్దం ఖర్చు అవ్వకుండా మనం కంగారుపడినా ఆదేహము మరణించదు. దేహప్రారబ్దాన్ని ఇష్టంతో అనుభవిస్తే మన రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి, మనకు శాంతి కలుగుతుంది, మనస్సు నశిస్తుంది. మీకు ఉన్న డబ్బునుబట్టి, మీ చదువును బట్టి గొప్పజన్మ ఏమిరాదు. మీ మనస్సుకు ఎంతవరకు లోచూపు కలిగింది, ప్రపంచంలో ఉన్న ఆకర్షణలను ఎంతవరకు తట్టుకోగలుగుతోంది అనే దానిని బట్టి రాబోయే జన్మ గొప్పజన్మవస్తుంది. గీతలో భగవంతుడు ఏమి చెప్పాడు అంటే నిన్ను ఎవరైనా భయపెడితే నీవు భయపడవద్దు, నీవు ఎవరినీ భయపెట్టవద్దు అని చెప్పాడు, ఇది ఆచరిస్తూ ఉంటే మనం అభివృద్ధిలోనికి వస్తాము కాని కేవలము డబ్బువలన అభివృద్ధిలోనికిరాము. జ్ఞానం చేసే పని డబ్బుచేయలేదు. డబ్బువలన భోగం వస్తుంది, అశాంతి వస్తుంది, జ్ఞానంలోనుండి శాంతి వస్తుంది. అయితే డబ్బులేకపోతే జీవితం వెళ్ళదు. శరీరం అన్నంతినాలి, బట్టకట్టుకోవాలి, దానికి ఏదోనీడ ఉండాలి, ఏదో వ్యవహారం ఉంటుంది, దానికి ఎంతో కొంత డబ్బు అవసరం అవుతుంది, ఆ డబ్బు అంతవరకే కాని అదే మనకు మోక్షం ఇచ్చేస్తుంది అని అనుకోకూడదు. నీకు అదృష్టం వస్తేరానియ్యి. నీ దేహప్రారబ్దంలో ఉంటే అది వస్తుంది, అలాగే దురదృష్టంవస్తే రానియ్యి. నీప్రారబ్దంలో ఉంటే అదివస్తుంది, ఇదంతా అసత్యమే. మంచి ప్రారబ్దం అయినా, చెడు ప్రారబ్దం అయినా అది కూడా మాయే. నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దానిని పొందటానికి ప్రయత్నంచెయ్యి, దానికోసం నీ మనస్సుకు ట్రైనింగ్ ఇయ్యి. నీకు అదృష్టం వస్తోంది అనుకో దానివలన నీకు ఎంతోకొంత సంతోషంవస్తుంది, ఆ సంతోషంవచ్చినప్పడు నీమనస్సుకు వికారం రాకుండా నువ్వుట్రైనింగ్ ఇస్తే మనస్సుకు లోచూపుకలుగుతుంది, మనస్స నిర్మల మవుతుంది, మనస్స అణుగుతుంది,





నీహృదయంలోఉన్న సత్యవస్తువుతో కలవటానికి తయారవుతుంది. నీకు అదృష్టం వస్తే వికారం రాకూడదు, ఇతరులకు అదృష్టంవస్తే అసూయరాకూడదు ఇలా నీమనస్సును సమానంగా ఉంచుకో, నీవు తరించటానికి అనేక సాధనలు ఉన్నాయి, అన్ని సాధనలకంటే సత్సంగము గొప్పసాధన అంటున్నారు, సత్పురుషులతో సహవాసం కలిగి ఉండటమే గొప్పసాధన, దానివలన నీ మనస్సు నశిస్తుంది. మామూలుగా మానవుడు మాయలో ఉంటాడు, అజ్ఞానములో కూరుకొనిపోయి ఉంటాడు, హెచ్చుతగ్గులుగా ఉంటాడు, సత్పరుషులతో సహవాసం వలన ఇవిఅన్నీ నాచురల్‌గా, నార్మల్‌గా నీకుతెలియకుండానే తగ్గుతూ ఉంటాయి. మహర్షులతోటి, మహాత్ములతోటి సాంగత్యంలేకుండా అజ్ఞానం నశించదు, అవిద్యనశించదు. వారితో సాంగత్యం వలన నీకు ముముక్షత్వం వస్తుంది, అందుచేత అట్టివారి సాంగత్యాన్ని కాంక్షించు. అహంభావన ఎలా ఉంటుంది అంటే మొన్న నేను ఎవరితోనో మీరు నిడదవోలులో చాలామంచి చేసారు అన్నాను, ఆయన ఏమంటున్నాడు అంటే ఒక్క నిడదవోలు లోనేకాదు, దేశమంతటా మంచిపనులు చేసాను అంటున్నాడు, పాపం సడన్‌గా ఆజీవుడు బయటకు వచ్చేసాడు, ఆచెప్పేది అహంభావన. వాడు చేసిన మంచి పనులకు రాబోయే జన్మ మంచి జన్మరావచ్చు కాని మోక్షం మటుకురాదు. నీవు ఎన్ని ప్రసంగాలు విన్నా, ఎన్ని శాస్త్రాలు చదివినా, సమాజానికి సంబంధించిన మంచి పనులు ఎన్నిచేసినా, సత్యసాక్షాత్కారం పొందినవారి దగ్గర ఉన్న వైభవం వీటివలనరాదు, ఆ ప్రెజన్స్, అటువంటిది,, ఆవైభవమే వైభవం, దానికి అదేసాటి. లోకంలో భిన్నత్వం ఉంటుంది, రకరకాల మనుషులు ఉంటారు, మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు, వారినిచూసి వికారాలు తెచ్చుకోవద్దు. వారి మధ్యలో, రకరకాల వికారాల మధ్యలో ఉండి అందరి హృదయాలలో ఉన్న నన్నుచూడటం నేర్చుకో, నువ్వు తరిస్తావు అని భగవంతుడు చెప్పాడు, ఆ గొడవలోనికి వెళితే, నీవు ఆ వికారాలలోనికి వెళితే మాయలోపడతావు, నీస్వరూపానికి దూరమవుతావు, ఈలోకంలోనికి ఎందుకువచ్చావో ఆపనిమర్చిపోతావు. జంతుశరీరంలో, మానవశరీరంలో, రాక్షసుల శరీరంలో, మంచివారి శరీరంలో, చెడ్డవారి శరీరంలో అందరి శరీరాలలో అంతర్యామిగానేను ఉన్నాను, వారిగోల నీకెందుకు, వారి సంగతి నేను చూసుకొంటాను, నీవు నన్ను చూడటం నేర్చుకో అంటున్నాడు పరమాత్మ. కొంతమంది తెలియనివారు ఏమనుకొంటున్నారు అంటే ఈభక్తిమార్గంలోనికి వెళితేపాడైపోతారేమో అనుకొంటున్నారు, వారు పాడైపోరు, బాగుపడతారు, భక్తిమార్గంలోనికి వచ్చాక వాడు చేసేపని ఇంకా శ్రద్ధగా, బాగా చేస్తాడు, ప్రేమిస్తూచేస్తాడు. నీకు సత్పురుషుల సహవాసం దొరికితే నీకు ఇంకేమి కావాలి అంటున్నారు భగవాన్ సత్పురుషుల సహవాసం అంటే మాటలు అనుకొంటున్నావేమో, సత్పురుషసహవాసంలో నీకు అన్నీ వచ్చేస్తాయి, మోక్షం

కూడా వచ్చేస్తుంది. పూర్వజన్మలలో మనం సత్కర్మచేసి ఉంటే, మనకు పుణ్యబలం ఉంటే సత్పురుషులతోసహవాసం చెయ్యాలి అని మనమనస్సుకు అనిపిస్తుంది లేకపోతే మనకు ఆకర్షణరాదు. మనం కాలేజికి వెళుతున్నాము, ఫిజిక్స్ నేర్చుకొంటున్నాము, కెమిస్ట్రీ నేర్చుకొంటున్నాము, లెక్కలు నేర్చుకొంటున్నాము, కాని ఏపనిచెయ్యాలి, ఏపనిచెయ్యకూడదు, ఎలా మాట్లాడాలి, ఎలా మాట్లాడకూడదు ఇవి మటుకు మనం కాలేజీలో నేర్చుకోవటం లేదు, వీటిని భగవద్గీత మనకు నేర్పుతుంది, మనం ఎలా జీవించాలో కాలేజీ నేర్పటంలేదు, మనం ఎలా జీవించాలో గీతమనకు నేర్పుతుంది. వస్తువులోపల ఉంది అనిచెప్పకొంటే సరిపోదు, అది అనుభవంలోనికి వచ్చినప్పుడు దాని తాలూక శాంతి, ఆనందం మనకు తెలుస్తుంది. మనం మాటని, చేతని, మనస్సును నియమించుకోవాలి, ఇవి మూడుఏకంగా ఉంటే మనస్సునశిస్తుంది. పంచదార ఉన్నచోటుకు చీమలు ఎలా ఆకర్షించబడతాయో అలాగ ఎవడైతే అమృతానుభవం పొందాడో వాడిచేత జీవకోటి ఆకర్షింపబడుతుంది. వాడు ఏగుహలో ఉన్నా, పర్వతాలలో ఉన్నావాడినుండి శాంతి తరంగాలు లోకంఅంతా ప్రవహిస్తూ ఉంటాయి, వాడు శరీరం ధరించి ఉంటే చాలు లోకానికి ఎంతో మేలు జరుగుతుంది. వారి సమక్షంలో ఉంటే మనం జ్ఞానం సంపాదించాలి, మనం బాగుపడాలి అనే బుద్ధిమనకు కలుగుతుంది, వారి సమక్షంలో ఉంటే మనలో ఉన్నా దుర్వాసనలు, దురాలోచనలు, దురలవాట్లునశిస్తాయి, వారి సమక్షమేచాలు. జ్ఞానిమౌనంగానే అనుగ్రహిస్తాడు. జ్ఞాని చూపు అనుగ్రహం, జ్ఞాని మాటఅనుగ్రహం, ఆయన శరీరం ధరించి ఉండటమే అనుగ్రహం. తేలిక మనుషులకు ఈ సబ్జక్టు అర్థంకాదు, ముందు మీరుతూకం పెంచుకోవాలి, అమృతానుభవం పొందటానికి మనకు ఉన్న అలవాట్లు, తలంపులు ఏవైతే అడ్డువస్తున్నాయో ముందు మనం చూసుకోవాలి, ఎవరికివారు అలాచూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. రోజూ కొద్దిటైము ఏకాంతంగా ఉండాలి. ఏకాంతంలో మనలో ఉన్న బలహీనతలు మనకు తెలుస్తాయి. మన మనస్సు ఏకారణాలవలన బాహ్యముఖమవుతోంది అని ప్రతీవాడు చూసుకోవాలి. మనకు ఇష్టం ఉన్నా, అయిష్టం ఉన్నా ఎవరి మీద అయినా అసూయ ఉన్నా మనమనస్సు బాహ్యముఖానికిపోతుంది. నీమనస్సు ఏకారణాలవలన బాహ్యముఖమవుతోందో, నీమనస్సుకు ఏ ఆకర్షణలు ఉన్నాయో చూసుకొని వాటిలో నుండి నీ మనస్సును తప్పించావు అనుకో అది వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. మనం నేను, నేను అంటున్నాముకదా అదే ప్రథమతలంపు, మూలతలంపు. అదే జీవుడు. దానికి ఉన్న ఆకర్షణలలో నుండి దానిని ఎప్పుడైతే విడుదల చేసామో. ఎప్పుడైతే దానిని ఒంటరి చేసామో అదివెళ్ళి దానిగూటిలో పడిపోతుంది, అప్పుడు అక్కడ ఉన్నశాంతి, ఆనందం మనకు అనుభవంలోనికి వస్తాయి, అప్పుడు జననమరణచక్రంలో నుండి





విడుదలపొందుతావు. మూలతలంపు దానిమూలంలో ఐక్యమయినప్పుడు ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినాశాంతే, ఎటుచూసినా ఆనందమే, వాడు ఆనందంకోసం బాహ్యపరిస్థితుల మీద ఆధారపడడు అంతేకాదు ఈ రూపము, నామము, ఈచేష్టలు అన్నీ కూడా స్వప్నసమానము అన్న సంగతివాడికి అనుభవంలోనికి వస్తుంది, అటువంటివాడు ఎవడైనా నీకు దొరికితేవాడితో సహవాసంచేస్తే నీమనస్సు అణిగిపోతుంది. ఆత్మానుభవం పొందిన తరువాత వ్యక్తి కనబడడు, దేహంతో తాదాప్యం పొందేనేను కనబడదు, దేహబుద్ధి నశించిన వెంటనే వాడికి ఆత్మబుద్ధి కలుగుతుంది. అందుచేతవాడు ఆదేహానికి కానీ, ఆపేరుకుగాని, లోకానికి గాని పరిమితమై ఉండడు, వాడికి దేనితోను తాదాప్యం ఉండదు. ఒకరూపంతోను, నామంతోను తాదాప్యం ఉన్నంతవరకు మనకు ఆత్మజ్ఞానంకలిగే అవకాశంలేదు. జ్ఞాని యొక్క ప్రభావము భక్తుని హృదయంలోనికి మౌనంగా ప్రవేశిస్తుంది. జ్ఞాని ద్వారా ఉద్ధరణ జరుగుతూ ఉంటుంది, వాడు మాట్లాడకపోయినా వాడి ప్రెజన్స్‌వలన మీకు మేలు జరుగుతూ ఉంటుంది. జ్ఞాని సైలెంట్‌గా పనిచేస్తాడు, నీమనస్సులో మార్పు తీసుకొనివస్తాడు, నీకు మారుమనస్సు కలుగుజేస్తాడు, నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు, ఆస్తికుడు భక్తుడు అవుతాడు, భక్తుడు జ్ఞాని అవుతాడు, నీ మానసికస్థాయిని అలాపెంచుతూ ఉంటాడు, ఏవో అద్భుతాలు చేస్తున్నట్లు కాకుండా ఇదంతా అత్యంత సహజముగా చేసుకొంటూపోతాడు, ఆయన ద్వారా నీకు ఉపకారం జరుగుతోంది అనికూడా నీకు తెలియనివ్వడు. జ్ఞాని సమక్షంలో లోపల ప్రక్రియ జరుగుతూ ఉంటుంది, ఆయన దయకు నీవు పాత్రుడవయితే ఆయన స్వరూపాన్ని ఇచ్చేవరకు నిన్ను వదలడు. జ్ఞానితో మానసిక అనుబంధం సరిపోతుంది మానసికఅనుబంధంవలన నీమనస్సు అణుగుతూ ఉంటుంది. అందుచేత దేహం ఎక్కడ ఉంది అనేది సమస్యకాదు, మానసిక అనుబంధం ముఖ్యం. మీరు విసుగులేకుండా, చిరాకులేకుండా, భగవంతుడిని స్మరించుకొంటూ, ధ్యానించుకొంటూ మీ పనిని మీరు జాగ్రత్తగా చేసుకోండి, అలా జీవిస్తూ ఉన్నా మీరు తరిస్తారు. నిరంతరం ఈశ్వరుని స్మరణవలన మనస్సు నశిస్తుంది. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో కలిసి ఉండగలిగితే మంచిదే, అలా ఉండలేకపోతే బయటఉన్న సత్పురుషుల సహవాసం అవసరం. చేస్తే ఏకాంతవాసం, బయటకు వస్తే సజ్జనసాంగత్యం. ఇంట్లో ఉంటే అలాగ ఉండు, బయటకు వస్తే ఇలాగ ఉండు, అప్పుడు నీమనస్సు నశిస్తుంది. మనోనాశనం గురించి ఎందుకు చెపుతున్నారు అంటే దుఃఖం అంతా మనస్సులో ఉంది, మనస్సు నశించినవాడికి దుఃఖంలేదు. లోపలఉన్న చావులేని పదార్థంతో నీకు అనుబంధం కుదిరితే అప్పుడు నీవు చావుని సహజంగానే జయిస్తావు. ఇప్పుడు మనం ఉన్నాము, ఈదేహం మరణించిన తరువాత మనం ఉండము అనుకొంటున్నాము, ఈబేధము ఎంతకాలం అయితే

ఉందో అంతకాలం మనకు పునర్జన్మ వస్తుంది. నీకు అమృతానుభవం కలిగినప్పుడు ఈదేహం ఉన్నా, లేకపోయినా కూడా మనం ఉంటాము అనేటటువంటి స్థితి నీకు కలుగుతుంది. అప్పటివరకు మనం సాధన చేస్తూ ఉండవలసిందే, శరీరం మరణించాక మనం ఉండము అనుకోవటం ఒకతలంపు, అది నిజంకాదు. దేహము నేను అనుకోవటం వలన ఆతలంపు వస్తోంది. దేహమునేను అనే తలంపుకు, దేహము మరణించాక ఉండము అని ఇంకో తలంపు వస్తోంది. అదిఎంత అసత్యమో ఇది కూడా అంతే అసత్యం. మనకు ఉండాలని ఉంది, లేకపోవటం అంటే మనకు ఇష్టంలేదు ఎందుచేతనంటే మనంఏదిగా ఉన్నామో అది ఎప్పుడూ ఉంటుంది. ఆ ఉండటం అనేది మన సహజస్థితి. శరీరంలో చాలా బాధలు ఉన్నాయి, భరించలేకపోతున్నాము అని అంటారు కాని చనిపోవటానికి ఇష్టపడరు ఎందుచేతనంటే ఉండటమే వాడి స్వరూపం. జననమరణచక్రం నుండి బయటకు రావటానికి, విషయప్రపంచంలోనుండి బయటకు రావటానికి, సంసారసముద్రాన్ని దాటటానికి సత్సంగము అనే నౌక తప్పించి, దానికి మించినది ఏదీలేదు అంటున్నారు ఆచార్యులువారు. మానవజన్మరావటం, జ్ఞానం సంపాదించాలి అనేకాంక్షరావటం, మహాత్ములతో సహవాసం కలగటం నీకు పూర్వజన్మలో పుణ్యబలం ఉంటేనే అది వస్తుంది. లేకపోతే అదిరాదు. మీకుంపట్లో ఉన్న నిప్పులను తీసుకొనివెళ్ళి కాలవలో పడవేయండి, అలాపడేస్తే కాలువ అంటుకోదు, నిప్పులు ఆరిపోతాయి. అలాగే మీకక్షలు, ద్వేషాలు, కార్పణ్యాలు తెచ్చి జ్ఞాని హృదయంలో పడవేయండి, దానివలన జ్ఞాని నశించడు, మీకక్షలు, ద్వేషాలు నశిస్తాయి, మీలో ఉన్న నాన్‌సెన్స్ అంతా తీసుకొని వెళ్ళి జ్ఞాని దగ్గరపడవేస్తే, ఆనాన్‌సెన్స్ అంతా ఆరిపోతుంది. జ్ఞాని యొక్క వైభవం అట్టిది. భూమికి ఎంత సహనం ఉంటుందో జ్ఞాని దగ్గరకూడా అంతసహనం ఉంటుంది. భక్తులుకానివారి మాటలు వదిలివేయండి, భక్తులు కూడా చిన్నమాట అంటే పడలేరు. మోక్షేమం కోరేవారు చిన్నమాట అన్నాపడలేకపోతున్నారు, ఇంక మనకు జ్ఞానం ఏమిటి? భగవంతుడు ఏమిచేస్తాడుఅంటే భక్తుడి చుట్టూ వికారాలు కలుగజేస్తాడు, ఆవికారాలు కలుగజేసినప్పుడు కూడా వీడు నిర్వికారంగా ఉన్నాడు అనుకోండి, సంసారచక్రంలోనుండి బయటకు తీసేస్తాడు, ఆయన దయతో తడిపి, ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. నీవు నిర్వికారంగా ఉండలేకపోతే జననమరణ చక్రం నుండి బయటకు తీయడు, అంటే వాడి కర్మనుబట్టి అలాదేహాలు వస్తూ ఉంటాయి. దేహము వస్తే పెరుగుతుంది, ముసలిది అవుతుంది, నశిస్తుంది. ఏదేహంలో ఉన్నప్పుడు ఆ దేహమే తాను అనుకొంటూ ఉంటాడు. అది జీవలక్షణం. జీవలక్షణాలు నశిస్తే గాని వాడికి అమృతానుభవం కలుగదు. మహాత్ముల సాంగత్యాన్ని వెతుక్కోండి. డబ్బు సంపాదించటానికి ఇక్కడ కుటుంబ సభ్యులను, స్నేహితులను అందరినీ





వదిలిపెట్టి అమెరికా వెళ్ళిపోతున్నారు. అమెరికా మన ఇంటి ప్రక్కన ఉందా? ఏదోడబ్బు సంపాదనకోసం అంతదూరం వెళ్ళిపోతున్నారు. ఇక్కడ భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే మహాత్ములు మీ ఇంట్లోనే ఉండనక్కరలేదు, ఇంటిప్రక్కనే ఉండనక్కరలేదు. ఎవరిని ఆశ్రయిస్తే మనకు జ్ఞానం కలుగుతుందో వారు ఎక్కడ ఉన్నావారికోసం అన్వేషణ చేయండి. వారిని వెతికి వారి దగ్గరకు వెళ్ళి వారికి సేవచేసి వారి దయను పొందండి, వారి దయవలన నీకు లోచూపు కలుగుతుంది. కొంతమందికి అసలు లోపల జీవితం ఎలా ఉంటుందో తెలియదు. ఏదో మారోజులు బాగావెళ్ళిపోతున్నాయి అనుకొంటారుగాని లోపల జీవితం, లోపల సౌందర్యం వారికి అక్కరలేదు. అదివారికి తెలియదు. ఇన్నర్‌లైఫ్ లేనివాడికి, లోచూపు లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మహాత్ములతోటి, యోగులతోటి సహవాసం లేకుండా నీకు ఇన్నర్‌లైఫ్‌రాదు. మీరు మంచిని నేర్చుకోండి, మంచిని గ్రహించండి. మీ మాట, చేత, బుద్ధి మంచిగా ఉండాలి, అప్పడు ఈశ్వరుని దయ మీ మీద వర్షిస్తుంది. ఇప్పడు మనం పచ్చిగా ఉన్నాము. జ్ఞాని మనలను ముగ్గబెడతాడు, మనబుద్ధిని పక్వస్థితికి తీసుకొనివస్తాడు. దానికి తగిన యోగ్యతను కలుగజేస్తాడు, అది జ్ఞాని యొక్క సహాయసహకారముల వలన మాత్రమే జరుగుతుంది. భక్తులు ఎలా ఉన్నారు అంటే వెంకటేశ్వరస్వామి దయవలన మా పని బాగానే ఉంది, మేము పరీక్ష పాసైపోయాము, లేకపోతే మాకు ఏదోసిరి వచ్చింది, ఆయన దయవలన మాకు మోకాళ్ళనొప్పలు తగ్గిపోయాయి అని చెప్పేవారేగాని స్వామి దయవలన మాకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని చెప్పే భక్తుడు ఒక్కడు కనబడడు. అంటే భక్తుల పరిస్థితి అలా ఉంది. అంటేఏది కోరుకోవాలో వారికి తెలియటం లేదు. మనం ఎటువంటి విషయాలు వినాలి, మనం ఎలా ప్రవర్తించాలి, ఏదికోరుకోవాలో తెలియజెప్పేదే నిజమైన విద్య.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 28-9-03, హైదరాబాద్

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పక్షి తన గూటిలోనికి వస్తే దాని మనస్సుకు, దాని ప్రాణానికి ఎలా ఉంటుందో ఈరోజున ఈ రమణ కేంద్రానికి రావటం మాకు అలాఉంది. మా ఇంటికి మేము వచ్చేసాము అనిపిస్తోంది. రమణభగవాన్ గురించి ఏదోచదివి, ఏదోవిని, ఆయన నామాన్ని స్మరించి, ఆయన రూపాన్ని ధ్యానించి మేము ప్రభావితం పొందలేదు. ఆయనే స్వయముగా ఒకసారి

నాకు స్వప్నదర్శనం ఇచ్చి, ఆయనవడిలోనికి తీసుకొని, నన్ను ముద్దుపెట్టుకొని, ఆశీర్వదించారు. ఆరకంగా నాజీవితంలోనికి రమణభగవాన్ ప్రవేశించారు, నేను ఎంతమంది మహాత్ముల గ్రంధాలు చదివినప్పటికీ, గురుస్థానం మటుకు రమణభగవాన్. అప్పటినుండి ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని ఆయన యొక్కదయ, ఆయన టీచింగ్ యొక్క ప్రభావము నామీద పడుతూవచ్చింది. 1959 జనవరి నెలలో మేము మొదటిసారిగా రమణాశ్రమం, అరుణాచలక్షేత్రదర్శనం చేయటం జరిగింది. రమణాశ్రమానికి వెళ్లకముందే భగవాన్ యొక్క సాహిత్యాన్ని ప్రచారంచేయటం, భగవాన్ జయంతి నిర్వహించటం జరుగుతూవచ్చింది, అది జన్మాంతర అనుబంధం. రమణభగవాన్ జ్ఞానావతారము. ఆయన చాలాతక్కువ మాట్లాడేవారు. ఆయన మాటలతో బోధించిన దానికంటే ఎక్కువగా మౌనంతో బోధించారు. ఎక్కడయితే మనస్సు అణిగిందో అక్కడ మౌనం నిలబడుతుంది, మనస్సు అణగకుండా మౌనం సాధ్యంకాదు. ఎవడైతే మౌనంలో స్థిరపడ్డాడో వాడు మాట్లాడినా, మాట్లాడకపోయినా ఆఉపాధి ద్వారా ఒకరీతిలోకాదు అనేక రీతులుగా లోకానికి మేలు జరుగుతుంది, వారి ఉనికి వలన ప్రపంచానికి సహాయసహకారములు అందుతూ ఉంటాయి. బుద్దుడు, శంకరాచార్యులవారు, రమణాచార్యుడు ఇలా ఎంతో మంది మహాత్ములు ఈ లోకంలోనికి వచ్చారు. మనం జ్ఞానులతో, మహాత్ములతో సహవాసం చేయటం వలన ఎంత లాభంపొందుతామో, అజ్ఞానులతో సహవాసం చేయటం వలన అంతనష్టాన్ని పొందుతాము. జ్ఞానులు మనకు ప్రేమించటం నేర్పుతారు, అజ్ఞానులు ద్వేషించటం నేర్పుతారు. మనం ఈలోకంలో ఎలా జీవించాలి అనేది మనకు జ్ఞానులు నేర్పుతారు, అది మనం జ్ఞానుల ద్వారా తెలుసుకోవలసిందే. మనం లోకాన్ని ప్రమాణంగా తీసుకోకూడదు, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకోవాలి. నువ్వులోకాన్ని చూస్తున్నావు. చూసేవాడు జీవుడు, చూడబడేది లోకం. ఆచూచేవాడు ఎవడు అని విచారణ చేయటం లేదు, అందుచేతనీకు ఆత్మజ్ఞానం కలగటం లేదు. అజ్ఞాని దుఃఖాన్ని పెంచుతాడు, దుఃఖరహితస్థితిని పొందటానికి జ్ఞాని సహకారం అందిస్తాడు. మీకు ఎన్ని సంపదలు ఉన్నా, ఎంతఅధికారం ఉన్నా దుఃఖంనశించదు. దేహము నేను అనే తలంపు అందరికి ఉంది, అందులోనే దుః ఖం అంతాఉంది. దేహము నేను అనే తలంపు నశించినవాడికి దుఃఖం కూడా నశిస్తుంది. నేను అనే తలంపు అది తెలుసుకోవాలి ఇది తెలుసుకోవాలి అంటుంది కాని తనను తాను తెలుసుకోవటానికి అది ఇష్టపడదు. ఎన్ని తెలుసుకొన్నప్పటికి తాను ఎవరో తనకు తెలియకపోతే వాడికి దుఃఖంనశించదు, మీరు ఎవరు? వారు ఎవరు? అని ప్రశ్నిస్తాము కాని ఇలా ప్రశ్నించేవాడు ఎవడు అని వాడిని మనం ప్రశ్నించటం లేదు, మాయఅంతా ఇక్కడే ఉంది. నేను ఇదిగా ఉన్నాను, నేను అదిగా ఉన్నాను అనేది అహంకారము, నేను





మంచి వాడిని, నేను చెడ్డవాడిని అనేది అహంకారము. ఇలా దేనితో ఒకదానితో, నువ్వుకానిదానితో తాదాప్యం పొందుతున్నావు. నేను ఎవడను అనే ప్రశ్న ఎందుకు ఉదయించబడింది అంటే మనం కానిదానిలో నుండి మనలను విడదీసి మనం ఏదిగా ఉన్నామో అందులో ఐక్యం చేయటానికి ఈ నేను ఎవడను అనే ప్రశ్న మనకు సహకరిస్తుంది. నేను ఎవడను అనే ప్రశ్న మనలను లోపలకు తీసుకొనివెళుతుంది, అంటే హృదయంలోనికి అంటే మన ఇంటికి మనం వెళతాము. ఆప్రశ్న వదిలేస్తే మన మనస్సు బాహ్యముఖానికి వెళ్లిపోతుంది. మనకు ధనం ఉంటే కాశీ, రామేశ్వరం ఎక్కడికయినా ప్రయాణాలు చేయవచ్చు. కాని లోపలకు ప్రయాణం చేయటానికి, ఎక్కడయితే నిజం ఉందో, ఎక్కడయితే భగవంతుడు ఉన్నాడో అక్కడకు వెళ్లాలంటే మనంకాలేజీలో చదువుకొన్న చదువులుగాని, మనకు ఉన్న ధనం కానీ, కీర్తిగాని ఇవేమీపనికిరావు, ఒక్క నేను ఎవడను అనే ప్రశ్న ద్వారానే మన హృదయంలోనికి మనం వెళ్లగలము. మనం నేను, నేను అంటున్నాము చూడండి, అది మిధ్యానేను, దొంగనేను. మనకు జ్ఞానం రాకపోవటానికి అదేకారణం. మనం గొప్పల కోసం పనులు చేస్తే మిధ్యానేను పెరిగిపోతుంది. మనమాట, మనం చేసేపని, మన ఆలోచన ఈమిధ్యానేను రెడ్యూస్ అయ్యేలాగ ఉండాలి. మనం ఏపనిచేసినా ఆందోళనగా చేయకూడదు, అహంభావనను పెంచుకోవటానికి చేయకూడదు. మనం చేసే పని నిర్మలంగా, నిశ్చలంగా, ప్రేమపూరితంగా చెయ్యాలి, పని పనికోసమేచెయ్యాలి, మనం ప్రేమను శాంతిని ధ్యానం చెయ్యాలి, గుణసంపదను ధ్యానం చెయ్యాలి. మనందరము ఈలోకంలోనికి వచ్చాము, ఏదో రోజున మనశరీరాలు మరణిస్తాయి. మనం ఈలోకంలోనికి వచ్చినందుకు ఈశరీరం మరణించకముందే ఎంతోకొంత మంచి చేయగలగాలి, మంచి చేయలేకపోతే కనీసం మంచి చేసేవారికి సహకరించాలి. కోరికలు అడుగుతాయి కాని ప్రేమ ఏమీఅడగదు. మనం ఎవరినీ ఏమీ అడగనక్కరలేదు. మన అర్హతనుబట్టి, యోగ్యతను బట్టి ఈశ్వరుడు ప్రసాదిస్తాడు, మనకు అర్హత లేకపోతే అడిగినారాదు. ఈశ్వరుడికి మన మనస్సును సమర్పిస్తే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, అదేమోక్షం. దానికి శరీరం మరణించటంతో సంబంధంలేదు, శరీరం ఉండగానే మనకు జ్ఞానానుభవం కలుగుతుంది. ఈశ్వరునిదయను సంపాదించినవాడికి ఎటువంటి జ్ఞానం కలుగుతుంది అంటే వాడికి శరీరం జీవించి ఉండటానికి, శరరం మరణించటానికి మధ్యన ఉన్న బేధంపోతుంది, అదే ఆత్మజ్ఞానం. దేహము ప్రారబ్దము ప్రకారము నడుస్తుంది, ప్రారబ్దం అయిపోయిన వెంటనే అది నశిస్తుంది. మరి సాధన ఎందుకు అంటే ప్రారబ్దాన్ని ఓర్పుగా అనుభవించటానికే సాధన. ప్రారబ్దాన్ని ఎవడైతే ఓర్పుగా అనుభవిస్తున్నాడో వాడికి జ్ఞానోదయం అవుతుంది. భక్తి వలన వికారాలు నశిస్తాయి, భక్తి వలనకూడా మనస్సు నశిస్తుంది, భక్తివలన శక్తి

వస్తుంది అంటే ప్రారబ్ధాన్ని నిర్వికారముగా అనుభవించే శక్తిని భక్తి ప్రసాదిస్తుంది. మీరు నన్ను ద్వేషిస్తున్నారు అనుకోండి, నేను కూడా మిమ్మల్ని ద్వేషిస్తూ ఉంటే మీరు నన్ను నోబుల్‌మేన్ క్రింద చూడనక్కరలేదు, ఆర్డనరీ మేన్ క్రింద చూడండి, అది ఆర్డనరీ మేన్ లక్షణం. నీ భక్తి వలన, వివేకం వలన ఈ మనస్సు యొక్క పరిధిని ఎప్పుడైతే దాటావో అప్పుడు నిన్ను ద్వేషించేవారి మధ్యన ద్వేషం లేకుండా ఉండగలవు, రకరకాల వికారాలు చూపించే మనుష్యుల మధ్యన వికారరహితంగా ఉండగలవు. ఒకో కళ్యాణగుణాన్ని, ఒకో కళ్యాణగుణాన్ని నువ్వు సంపాదించనక్కరలేదు. నీవు ఎప్పుడైతే సత్యాన్వేషణలో ఉన్నావో, నువ్వు ఎవడో నీవు తెలుసుకోవటానికి ఎప్పుడైతే ప్రయత్నం చేస్తున్నావో అప్పుడు అన్ని కళ్యాణగుణాలు వచ్చి నిన్ను వరిస్తాయి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. మనకు జ్ఞానాన్ని ప్రసాదించమని మనం ఆయనను ప్రార్థించాలి. ఎప్పుడు ఏజీవుడికి ఏది చెయ్యాలో ఆయన చేస్తూ ఉంటాడు. ఆయన చేస్తూ ఉంటాడు అని మాకు ఎలా తెలుస్తుంది అని మీరు అడగవచ్చు, మీరు శరణాగతి చేస్తే అది మీకు కూడా తెలుస్తుంది. మనకు తెలిసినా, తెలియకపోయిన జరిగేది అదే. ఈశ్వరుని దయ లేకుండా అజ్ఞానం నశించదు మనం ప్రేమ లేకుండా ఉన్నాము అని ఈశ్వరుడు ప్రేమలేకుండా లేడు. ఆయన ప్రేమను, కరుణను ఎప్పుడు ఇవ్వాలో ఆయనకు తెలుసు. మనకు అర్హత కలిగినప్పుడు ఆయన దయను పంపించి నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. భక్తికూడా పులి లాంటిది. పులిదగ్గరకు మేకలు, గొర్రెలు రావు అలాగే నీభక్తి నిజమైతే నీదగ్గరకు దురాలోచనలు రానే రావు. నీ హృదయంలో సత్యం ఉంది దాని స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే శాంతి. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఆ ఆనందం, శాంతివచ్చి, నీ సహస్రాన్ని ముంచుతాయి, జనన మరణ చక్రం నుండి విడుదల పొందుతావు, జీవిత రహస్యం కూడా నీకు తెలుస్తుంది.

ఎక్కడయితే కోరిక ఉంటుందో అక్కడ దుఃఖం ఉంటుంది, కోరిక లేనివాడికి దుఃఖం లేదు. మీకు కీర్తికాంక్ష ఉందనుకోండి, ఆకీర్తి రావటం లేదు అనుకోండి అప్పుడు దుఃఖం వస్తుంది. ఆకాంక్షేలేనప్పుడు అసలు దుఃఖం సమస్యేలేదు. మీరుఔన్నత్యాన్ని కోరుకోనక్కరలేదు. మీరు ఎప్పుడైతే సత్యాన్వేషణలో ఉన్నారో అప్పుడు మీకు అవసరం లేకపోయినా ఔన్నత్యం మీ వెంటపడుతుంది. రమణమహర్షి గ్రేట్‌మేన్ అని ఇప్పుడు మనం అనుకొంటున్నాము. అది ఆయన కోరితెచ్చుకొన్నదికాదు, ఆయన రీలైజేషన్ పొందటంవలన అది వచ్చింది. సత్యాన్వేషకుడి కూడా ఆగ్రేట్‌నెస్ ఎంతోకొంత వెంటపడుతుంది కాని అది వాంఛించటంవలన వచ్చిందికాదు. నీవు లవ్‌ను ప్రాక్టీసు చేయాలి. నువ్వు ఎప్పుడైతే ప్రేమశిఖరాల్ని అందుకొన్నావో అప్పుడు నీమనస్సు స్వచ్ఛమవుతుంది, అప్పుడు జ్ఞానమే నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. కేవలము తాత్కాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని





జ్ఞాని మాటలు చెప్పడు. అందుచేత ఆయన ఏమాట చెప్పినా అది ఫైనల్ వర్డ్. ఎప్పుడూ చెడ్డ విషయాల గురించి శ్రవణం చేస్తూ ఉంటే నీకు మంచి ఎలా తెలుస్తుంది, నీవు బుద్ధిమంతుడవు ఎలా అవుతావు. ఎప్పుడూ అనాత్మ గురించి శ్రవణం చేస్తూ ఉంటే నీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. మీరు ఆత్మజ్ఞానం గురించి శ్రవణం చేయండి, మననం చేయండి, దానిని అనుభవించండి అప్పుడు దాని రుచి మీకు తెలుస్తుంది. మహిమల జోలికి వెళ్ళవద్దు. వాటిలోనికి వెళితే మోక్షమార్గాన్ని తప్పిపోతారు. అప్పుడు మనం దేవుడికి భక్తులంకాదు, లోకానికి భక్తులం అవుతాము. మీ పని మీరు శ్రద్ధగా చేసుకోండి, మిగతా టైము అంతా సత్యాన్వేషణకు ఉపయోగించండి. మన డ్యూటీ మనం చేయకపోతే బానిసత్వం వస్తుంది. భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను సమాజం కోసం ఉపయోగిస్తే మనస్సు విశాలం అవుతుంది. నీ ఆలోచన యొక్క లోతులు పెరుగుతాయి. ఆత్మజ్ఞానానికి వారసుడవుతావు. భగవుంతుడు నీకు ఏదైనా శక్తిని ఇస్తే దానిని సద్వినియోగం చేయాలికాని దుర్వినియోగం చేయకూడదు, సద్వినియోగం చేస్తే మన చైతన్యస్థాయి పెరుగుతుంది. దుర్వినియోగంచేస్తే మనం పతనమవుతాము. భక్తులలో కొంతమందిని చూస్తున్నాను వారికి శ్రద్ధ ఉంటుంది, తెలుసుకోవాలనే కాంక్ష ఉంటుంది కాని ధైర్యం ఉండదు. మనకు ధైర్యంలేకపోతే ఈ ఆధ్యాత్మికజీవితంలో సక్సెస్‌అయ్యే అవకాశంలేదు మనకు వివేకం. ఎంత అవసరమో ధైర్యంకూడా అంతే అవసరం. ప్రేమకంటే ద్వేషం వేగంగా పని చేస్తుంది. నెగిటివ్ తింకింగ్ వలన మనకు ఆత్మజ్ఞానంరాదు. ఎవరైనా మిమ్మల్ని ఉద్రేకపరుస్తున్నారు అనుకోండి, దానికి మీరు ఉద్రేకపడుతూ ఉంటే మీరు గ్రేట్‌మేన్‌కాదు. మీకు ఎంతధనం ఉన్నా, పాండిత్యం ఉన్నా దానితో గ్రేట్‌నెస్ కొలవబడదు. మహర్షులను, మహాత్ములను, ఋషులను గౌరవించే శక్తి మనకుఉంటే గౌరవించవచ్చు కాని వారిని అగౌరవపరచకూడదు, దానివలన నీ జీవితంలో చాలా నష్టపోతావు. మీరు భక్తి గురించి చెపుతూ ఉంటే చాలా గొప్పగాఉంది. నాకు ఎంతోకొంత భక్తిఉంది అది పెరిగేటట్లు, అదిస్థిరపడేటట్లు నన్ను ఆశీర్వదించండి, నన్ను అనుగ్రహించండి అని ఒక భక్తుడు అడుగుతున్నాడు.ఆ అడిగేపద్ధతిలోనే గురువు దయవచ్చేస్తుంది. మనం చేసే పని మనం తరించటానికి సహకరించాలి, పనిచేస్తూ జ్ఞానం పొందాలి. పనిచెయ్యి ఎలా చెయ్యాలో తెలుసుకొని చెయ్యి. నేను చేస్తున్నాను అనే తలంపుతో ఏపనిచేసినా నీకు దుఃఖం వస్తుంది. నీకర్తృత్వబుద్ది నీకు దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. రైలు ఇంజను కదిలింది అనుకోదాని వెనకాల పెట్టెకదలకుండా ఉండదు. అలాగే నీవు కర్తృత్వంతో ఒకమాట మాట్లాడినా, ఒకపనిచేసినా నిన్ను దుఃఖం వెంటాడుతుంది, పునర్జన్మలకు హేతువు అవుతుంది. అహంభావన నశిస్తేనే కాని ఆత్మజ్ఞానం కలుగదు. ఆత్మజ్ఞానం లేకపోతే సంసారచక్రంలో

నుండి విడుదల పొందలేవు. ఇప్పుడు ఈ సమస్యవలన మనకు దుఃఖం వస్తోంది అనుకొంటున్నాము, మరల రాబోయే జన్మలో ఈ కారణం లేకపోవచ్చు, ఇంకో కారణంవలన దుఃఖం వస్తుంది. మారోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి అని మీరు అనుకొంటూ ఉంటారు. ఈలోపు మీ అబ్బాయికి పెళ్ళిఅవుతుంది. మీ కర్మ అంతా ఆకోడలిరూపంలో సిద్ధమవుతుంది. వచ్చేది మీ కోడలు కాదు. మీ కర్మే ఆరూపంలో వస్తుంది. భగవంతుడు పెద్ద ప్లానింగ్ హెడ్. ఎక్కడ ఏసంఘటనను ఎలా అనుసంధానం చేయాలో ఆయనకు తెలుసు, మన కర్మానుసారం మనలను త్రిప్పతూ ఉంటాడు, వాడే భగవంతుడు. రమణమహర్షి అరుణాచలంవచ్చిన రోజులలో ఎక్కడో ఒంటరిగా కూర్చుని ఉండేవాడు, ఎవరూ ఆయనతో మాట్లాడేవారుకాదు, విరూపాక్షగుహలో ఉండగా ఉదయంభోజనం ఎవరోతెచ్చి మధ్యాహ్నం పెట్టేవారు, ఆయన బంధువులుకూడా వచ్చి చూసి భాదపడేవారు ఏదో ఉద్యోగం చేసుకోవలసినవాడు యిలా పాడైపోయాడు ఏమిటి. ఇంత ఇబ్బంది పడుతున్నాడు ఏమిటి? అని ఆయన బాహ్యరూపం చూసి జాలిపడేవారు. కాని ఆయనలోపల ఎంత ఆనందాన్ని ఎంజాయ్ చేస్తున్నాడో, ఎంత శాంతిని అనుభవిస్తున్నాడో వారికి తెలియదు. బాహ్యంగా చూస్తే పాడైపోయినట్లు అనిపిస్తుంది కాని ప్రపంచంలో ఉంటూ నిష్ప్రపంచస్థితిలో ఉన్నాడు. నాకు భక్తికావాలి అని ఒకరు అడిగితే నేను ఇస్తాను అనటం లేదు, నీ తపనవలనే నీభక్తి పెరుగుతుంది, నీ జిజ్ఞాసే నీకు జ్ఞానం కలుగజేస్తుంది. నీవు తపించగా తపించగా నీకు వద్దన్నా ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది అంటే మనకు అర్హతలేదు అనుకోండి జ్ఞానం కావాలి, జ్ఞానం కావాలి అంటేరాదు, మనకు అర్హత కలిగితే వద్దువద్దు అన్నా అది వచ్చి మీదపడుతుంది. భగవాన్‌ది అంతా యింపెర్సనల్ బిహేవియర్, ఆయన మీద ఏమీ పెట్టుకోడు. మీదయ మాకు కావాలి అని అడిగితే ఈశ్వరుని దయ మీకు ఉంటే నాదయ మీకు ఉన్నట్లే అంటారు. మీకోసం మేము అరుణాచలం వచ్చాము అని ఆయనతో అంటే నాకోసం మీరు వచ్చాము అని అంటున్నారు మరి నేను ఎవరికోసం వచ్చాను. నన్ను ఏ ఈశ్వరుడు అయితే అరుణాచలం తీసుకొని వచ్చాడో ఆయనే మిమ్మల్ని ఇక్కడకు తీసుకొని వచ్చాడు, మధ్యలో నేను ఎవడను అంటారు. అంటే అక్కడ వ్యక్తిభావన కనబడదు, ఆయన మధ్యవర్తిగా ఉండటానికి ప్రయత్నం చేయడు. ఉన్నది ఒక్కటే, ఉన్నది ఈశ్వరుడే. ఆయన మాటలో, చేతలో ఎక్కడా వ్యక్తిభావన కనబడదు. ఎప్పుడైతే వ్యక్తిభావన నశించిందో, ఎప్పుడైతే అహంభావన నశించిందో ఆదేహాన్ని ఈశ్వరుడు స్వాధీనం చేసుకొంటాడు. దేహగతమైన నేను నశించిన మరుక్షణంలో మీ దేహాన్ని ఈశ్వరుడు స్వాధీనం చేసుకొని, ఆదేహం ద్వారా ఆయన వ్యవహరిస్తాడు. మనందరంకోపం చేసుకోవటం నేర్చుకొన్నాము కాని సహించటం నేర్చుకోలేదు. సహించటం నేర్చుకొంటేనేగాని మనస్సుకు లోచూపుకలగదు.





మనస్సుకూడా కర్పూరంలాంటిదే. కర్పూరం కాలిపోతే ఏ ఆచూకీ ఉండదు, అలాగే మనస్సు కూడా కాలిపోతే, మనస్సు కరిగిపోతే ఆత్మలో లీనమవుతుంది. మనస్సు ఎప్పుడూ తలకాయలో ఉంటుంది, దానిని ఉపసహరించి హృదయంలో స్థిరంగా ఉంచగలిగితే అది నశిస్తుంది. కోరికతో ఏపని చేయకూడదు. మనం కోరికతో పనిచేస్తూ కోరికలులేనిస్థితికి ఎలావెళ్ళగలము. మనం ప్రతీ విషయానికి భయపడుతూ ఉంటే, భయంతో పనిచేస్తూ ఉంటే భయంలేనిస్థితికి ఎలా వెళ్ళగలము. ప్రపంచంలో ఏసంఘటన జరిగినా భగవంతుడికి తెలియకుండా జరగటంలేదు. ఇదంతా మనం ఏదో ఉద్ధరించేయాలి అని అలా మనం ఏమీ అనుకోనక్కరలేదు. మన డ్యూటీ ఏదోమనం శ్రద్ధగా చేయాలి, అంతవరకే. నువ్వుపుట్టకముందు ఈలోకం ఉంది, నీ శరీరం మరణించిన తరువాత ఈ లోకం ఉంటుంది. ఈలోకానికి ఎవడైతే ప్రాణం పోశాడోవాడు ఈలోకాన్ని చూసుకొంటాడు. నువ్వువచ్చిన పనినీవు చూసుకో, జ్ఞానసముపార్జన కోసం మనం ఈభూమి మీదకు వచ్చాము, ఆ పని చూసుకో మనం ఏదైనా పనిచేసేటప్పుడు గుర్తింపు వస్తుంది అంటే ఆపనిచేస్తాము లేకపోతే ఆపనిచెయ్యము. ఇది మన అందరిలో ఉన్న బలహీనత, గుర్తింపు ఎవరికి అంటే అహంకారానికే, అంటే గుర్తింపుకోరుకొంటూఉంటే మనకు తెలియకుండా అహంభావన పెరిగిపోతుంది. గుర్తించటంవలన మనకు వచ్చేలాభంలేదు. గుర్తించకపోవటం వలన మనకు వచ్చే నష్టంలేదు. వారు గుర్తించినా, గుర్తించకపోయినా మన నిదానంలో మనం ఉండాలి, అప్పుడు జ్ఞానసముపార్జనకు మన మైండ్‌ప్రిపేర్ అవుతుంది. ఏదో లాభం వచ్చింది లేకపోతే నష్టం వచ్చింది అని మనకు అనిపిస్తుంది. లాభం వచ్చింది అనుకొన్నా, నష్టం వచ్చింది అనుకొన్నా మన మనస్సు, బాహ్యముఖ మవుతుంది. బాహ్యదృష్టి ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలిగే అవకాశంలేదు.

ఏకారణంచేతఅయినా మీకు కోపం వస్తోంది అనుకోండి, ఆకోపాన్ని మీరు దృశ్యముగా చూడగలగాలి, మీకు చిరాకు వస్తోంది అనుకోండి దానిని దృశ్యముగా చూడగలగాలి, మీరు అందులో కలవకూడదు, మీరు వేరుగాఉండి దానిని చూస్తూ ఉంటే అది నశిస్తుంది. రాగము, ద్వేషము ఇవిఅన్నీ కూడా ఉద్రేకాలు, మనకు ఉద్రేకము వచ్చేకొలది ఆలోచనకు దూరమవుతాము. ఈమధ్య ఒకపెద్దమనిషి చెప్పాడు నాకు అప్పుడప్పుడు ఎమోషన్ వస్తోంది. మామూలుగా వరిచేలకు ఎరువు ఎలా వేస్తారో అలాగ నాకు వచ్చే ఎమోషన్‌ని నేను చేసేమంచిపనికి ఎరువుగా ఉపయోగించుకొంటున్నాను. నా ఎమోషన్‌ను నేను పోజిటివ్‌గా ఉపయోగించుకొంటున్నాను గాని నెగిటివ్‌గా ఉపయోగించుకోవటంలేదు అనిచెప్పాడు, అప్పుడు ఆయన తరిస్తాడు ఎందుచేతనంటే ఆయనకు వచ్చిన ఎమోషన్ ఆయనకు పోజిటివ్ అవుతోందిగాని నెగిటివ్ అవ్వటంలేదు.

మీరు అందరిమీద కోపం చేసుకొంటున్నారు, మీమీద మీరు కోపం చేసుకోండి జ్ఞానం వచ్చేస్తుంది అంటున్నారు భగవాన్. ఇతరులమీద కోపం చేసుకోవటం కాదు, మనకుఉన్న అవిద్యమీద, మనకు ఉన్న అజ్ఞానంమీద కోపం చేసుకోవాలి. మనందరకు దుఃఖం అంటే ఇష్టంలేదు, దుఃఖంవస్తూ ఉంటే దానినివద్దు, వద్దు అంటున్నాము, దుఃఖంవస్తే నష్టం ఏమిటి? మనందరకు చావు వస్తోంది అంటే భయం, నువ్వురావద్దురావద్దు అంటాము. మరణంవస్తే నష్టం ఏమిటి? నీ స్వరూపంలో ఏదైతే లేదో అది వచ్చినప్పుడు నువ్వు రావద్దు అంటున్నావు. నీస్వరూపంలో మరణంలేదు, నీస్వరూపంలో దుఃఖంలేదు. అందుచేత అవి వస్తూ ఉంటే వాటినిరావద్దు అంటున్నాము, వాటిని రిజెక్టుచేస్తున్నాము. నీకు శాంతి వస్తోంది అనుకో, సుఖం వస్తోంది అనుకో ఎంతబాగుంది, ఎంత బాగుంది అని వాటిని స్వీకరిస్తున్నావు. నీ స్వరూపంలో ఏదైతే ఉందో అదివస్తే దానిని ఏక్సెప్టు చేస్తున్నావు, నీ స్వరూపంలో లేనిదివస్తే దానిని రిజక్టుచేస్తున్నావు. జాగ్రదవస్థ, స్వప్నావస్థ, గాఢనిద్ర ఈమూడు అవస్థలను మనం రోజూ చూస్తున్నాము. నీకు ఎప్పుడైతే అమృతానుభవం కలిగిందో అప్పుడు ఈమూడు అవస్థలలో నుండి నీవు వేరుపడిపోతావు, వేరుపడటమేకాదు ఆనందంవచ్చి నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఆ ఆనందానుభవం పొందాక నీదేహం పడిపోయిన ఆనందంమటుకు అలా కంటిన్యూ అయిపోతుంది. దేహం ఉన్నంతసేపు దానికి చాలా చాకిరీ చేయాలి. దానికి రెండు పూటల అన్నంపెట్టటం, బట్టలు వేయటం, సినిమాలకు హాస్పటల్స్‌కు తిప్పటం, ఈలోగా ఆదేహాన్ని ఎవరైనా తిడితే దుఃఖం, దానిని పొడిగితే సంతోషం ఇలా ఎంతో చాకిరీ చేస్తున్నాము. అది మనకు తెలియటంలేదు. బ్రాహ్మీస్థితిని పొందినప్పుడు దేహం ఉండటానికి, దేహంలేకపోవటానికి మధ్యన బేధం పోతుంది. నీవు జపంచేస్తున్నావు అనుకో, ధ్యానంచేస్తున్నావు అనుకో, సత్పురుషులతో సహవాసం చేస్తున్నావు అనుకో అప్పుడు నీమనస్సు నిర్మలమవుతుంది. మీరు మనస్సును నిర్మలం చేసుకోమంటున్నారు కాని మాఇంట్లో ఉన్నవారు రాక్షసులు, యింటి ఎదురుగా ఉన్నవారు రాక్షసులు, వెనకాల ఉన్నవారు రాక్షసులు, ప్రక్కన ఉన్నవారు రాక్షసులు, ఇంతమంది రాక్షసుల మధ్యన మనస్సును నిర్మలంగా ఉంచుకోగలమా అని మీరు అనవచ్చు, అలా ఉంచుకోగలగటమే సాధన యొక్క గమ్యం. ఇంతమంది రాక్షసుల మధ్యన మీ మనస్సును నిర్మలంగా, పవిత్రంగా నిశ్చలంగా ఉంచుకోగలిగితే ఓహో! వీడు సామాన్యమానవుడుకాదు వయ్యా, వీడిబుద్ధి పక్వానికి వచ్చింది, ఇంతమంది రాక్షసుల మధ్యన నిర్మలంగా ఉంటున్నాడు అని ఈశ్వరుడు పొంగిపోయి నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. దుఃఖం నశించటానికి ఒక క్లూ చెపుతున్నారు. ఫలానాశరీరంనాది, ఫలానా పేరునాది అని ఇలా అనుకోకుండా, వాటితో తాదాప్యం కనుకపోతే ఈక్షణంలోనే దుఃఖం నశిస్తుంది, ఈరెండింటితో తాదాప్యం వదిలేసాము





అనుకోండి నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా మనస్సు వెళ్ళి ఆత్మలోలీనమై, ఆత్మాకారం చెందుతుంది. సహజంగా జ్ఞాని ద్వారా సహాయ సహకారములు అందుతూ ఉంటాయి. అంతేగాని నేను సహకరిస్తున్నాను అని ఆయన అనుకోడు, అలా అనుకొనేవాడు అక్కడలేడు జ్ఞాని శరీరం ధరించి ఉంటేచాలు, వాడి ప్రెజెన్సుచాలు, వాడు నోటితో మాటలు చెప్పనక్కరలేదు, వాడి ద్వారా ఏదోరూపములో సమాజానికి సహాయసహకారములు అందుతూనే ఉంటాయి. వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు మాటలు, అనుభవంలోనికి వచ్చాక మాటలు పడిపోతాయి, ఆనందమే ఆనందం, శాంతేశాంతి. ఎప్పుడో ఎక్కడోకాదు, ఇప్పుడే ఇక్కడే ఆవస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవాలి, అది నీలోపలేఉంది, సహజంగా ఉంది, రవ్వంతముల్లంత నీవు ప్రయత్నంచెయ్యి, లోపలకుచూడు, అప్పుడు వస్తువు నీకు గోచరిస్తుంది. భగవాన్ ఎక్కువగా మౌనంగానే ఉండేవారు. మౌనం అర్థంకావటంలేదు అనుకొన్నప్పుడు మాట చెప్పేవారు. మౌనం అంటే నోరు మూసుకోవటం మౌనంకాదు, అహంభావన వేరుతో సహా నశిస్తే అక్కడనుండి మౌనం వస్తుంది. ఆమౌనం నీకు బోధిస్తుంది. అది రాగికలపని బంగారం. నేనేచెప్పాలి, ఇతరులు చెప్పేది ఏమీలేదు అని అనుకోకూడదు దానివలన అజ్ఞానం పెరుగుతుంది. ఇతరులు చెప్పేటప్పుడు వినాలి, అర్థం చేసుకోవాలి, తరువాత మనం చెప్పేది ఏదో వారికి చెప్పవచ్చు. సత్యానుభవం పొందిన వాడి ద్వారా ప్రభుత్వాలు కూడా చేయలేని ఉపకారం సమాజానికి జరుగుతుంది. ప్రభుత్వం నీకు బాహ్యమైన కంఫర్టు ఇస్తుంది కాని దానివలన కంట్రోలురాదు. జ్ఞాని సహకారంవలన నీకు కంట్రోలు వస్తుంది, కంట్రోలు వలన నీకు హేపీనెస్ వస్తుంది. ఎన్నిశాస్త్రాలు చదివినా అందులో చెప్పింది ఏమిటి, మనోనిగ్రహం గురించి చెప్పారు, అది సాధించు. మనం అజాగ్రత్తగా ఉండకూడదు, ప్రతీ క్షణం జాగ్రత్తగా ఉండాలి. శ్రీ కృష్ణచైతన్య దగ్గర ఒక ముస్లిం భక్తుడు ఉండేవాడు, అతనికి మరణ సమయం వచ్చింది. నీకు ఏమికావాలి అని శ్రీకృష్ణ చైతన్య ఆభక్తుడిని అడుగుతాడు. నాకు ఏమీవద్దు, నీవు లేని ఈలోకాన్ని నేను చూడలేను అందుచేత నీ ముక్కులోగాలి తిరుగుతూ ఉండగానే నాముక్కులో గాలిపోవాలి అంటాడు. ప్రక్కన ఉన్న భక్తులు నీవు బాగా సాధన చేసావు, తరిస్తావు అంటారు. కళ్ళుమూసుకొని ఉన్న ఆభక్తుడు నెమ్మదిగా కళ్ళు తెరచి నేను జాగ్రత్తగా జీవించానుఅని, నేను తరించాను అని అప్పుడే మీరు అనుకోవద్దు. ముక్కులో ఉన్న చివరి శ్వాస బయటకుపోయాక వీడు గొప్పగా జీవించాడు అని చెప్పకోండి, ఈ చివరి క్షణంలో నాకు చెడు ఆలోచనలు రావచ్చు, దైవచింతన పోవచ్చు అంటాడు. ఉపనిషత్‌లలో ఏమి చెప్పారు అంటే కత్తి అంచున నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉండాలో, ఈఆధ్యాత్మిక జీవితంలో సాధకుడు కూడా అంత జాగ్రత్తగా వుంటేనే వాడు సిద్ధిని పొందుతాడు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే అక్కడ కుంకుమ వచ్చిందని, ఇక్కడ పసుపు వచ్చిందని, అక్కడ ఏదో మహిమ ఉందని అలా ఎందుకు బజారులో తిరుగుతారు, మనోనాశనం కంటే గొప్ప మహిమ ఏదైనా ఈ సృష్టిలో ఉందా అంటున్నారు, దానిని వదిలేసి బజారులో తిరుగుతారు ఎందుకు? మీ హృదయంలో

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 09-11-03 | ఆది | కొమ్మర |
| 12-11-03 | బుధ | కైకలూరు |
| 16-11-03 | ఆది | కాకినాడ, క్షత్రియ కళ్యాణ మండపం, గాంధీ పార్కు |
| 19 టు 22-11-03 | | హైదరాబాదు క్యాంపు |
| 23-11-03 | ఆది | పాలకొల్లు, మధ్యాహ్నం 3 గం॥లకు, క్షత్రియ కళ్యాణ మండపం |

## "భయంలేని వస్తువు తెలిసే వరకూ, భయం విడిచిపెట్టదు"

మసకచీకట్లో వంకరగాపడిఉన్న తాడునుచూచి పాముని భ్రమపడి భయంతో ఆందోళన చెందుతాము. అప్పడే వివేకి అయినవాడు లైట్‌సహాయంతో అది తాడనిగుర్తించి భయరహితుడుఅవుతాడు. అలాగే తాను శరీరమాత్రుడనని, మరణిస్తే తన సంతోషాలన్ని బూడిదపాలౌతాయని భావించే వాడికి జీవితం అంతా భయమే. హృదయం నుంచి వచ్చిన సద్గురువు యీమాటలు "నీవు ఆత్మస్వరూపుడవు శరీరం నీకు ఒక వస్త్రంమాత్రమే" అన్నమాటతో అదే నిశ్చయజ్ఞానంతో ఉంటూ శాంతంగా ఉంటాడు. సాధకుడు తన భద్రత గురించి మితిమీరిన ఆందోళన, లేదా సంపదను చూచుకొని మితిమారిన విశ్వాసం కలిగి ఉండే అలవాట్లు లేకుండా చూచుకోవాలి. కారణం ఈశ్వర ప్రణాళికననుసరించి అన్నీ జరుగుతాయనే విశ్వాసం మనస్సులో సదానిలుపుకొంటే భయంలేకుండా శాంతంగా - సుఖంగా ఉండగలము. ఏకష్టమైన శాశ్వతంగా నిలవదు అనే ధైర్యంతో సహనంతో అచెంచల విశ్వాసంతో భాదలను ఎదుర్కొనాలి. తన అస్థిత్వం పై పరిపూర్ణవిశ్వాసం ఉన్న వ్యక్తి అన్ని కష్టాల్లోనూ ఎంతటి దురదృష్టంలోనైనా నిరాశ, నిస్పృహలేకుండా చివరిదాకా ఆ కష్టాన్ని ఎదుర్కొని పోరాడగలడు. శ్రీనాన్నగారు యిలా అంటారు " బ్రహ్మం వ్యక్తమయ్యేవరకూ - కోరికలు, వ్యసనాలు, భయాలు వెంటాడుతాయి " అని జి.కె. అంటారు. దేహంపోవటం భయంకాదు - అన్ని సంతరించుకొన్న "నేను" అనే ఆలోచనపోవడం భయం గొల్పుతుంది. మనస్సుతోచూడకు - కళ్లతోచూడు. తరువాత కళ్లుమూసుకొని ఏమిజరుగుతుందో ప్రశాంతంగా గమనించు. చూచేవాడు చూడబడేదీ ఒకటే అని తెలుసుకొంటావు అన్నారు. " మీ ఒంటి మీద పాముప్రాకితే భయం కలుగలేదా "అన్నమాటకు భగవాన్" చెట్టుమీద పాముపాకితే చెట్టుకు భయం కలుగుతుందా? నా కన్న భిన్నంగా ఏదీ లేదే భయపడటానికి" అన్నారు అది జ్ఞానివైభవం. భయం మనిషిని నిర్వీర్యం చేస్తుంది. గాంధీజీ రామనామాన్ని నిత్యం జపించిభయరహితులైనారు. మనకృషే కృపగా మారిపోతుంది. తత్వజ్ఞానాన్ని సదామనస్సులో నిలుపుకోవటం వల్ల అసాధ్యమనుకున్నది సాధ్యమౌతుంది. అధ్యయనం విడిచిపెడితే అంధకారంలో కూరుకుపోతాము.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం





ది. 27-10-03న పాలకొల్లు వెంకట్రామ థియేటర్ ప్రక్కన విజయ ఆర్థోకేర్ ఆస్పటల్‌ను జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు

## భక్తులకు మనవి !

### సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనములు ఆడియో కేసెట్స్

టి సీరీస్ కంపెనీ కేసట్ ధర రూ.35/-

ఆర్డినరీ కేసట్ ధర రూ.20/- (ఆర్డరుపై ఇవ్వబడును)

కొరియర్ చార్జి రూ.3/- అదనం. కేసట్లు కొరకు యం.ఓ., జిన్నూరుపై / డి.డి. పాలకొల్లు బ్రాంచిపై పంపవలసిన చిరునామా :

**పి.ఎస్. రామరాజు, ఎడిటర్, రమణ క్షేత్రం, జిన్నూరు, ప॥గో॥ జిల్లా**

## రమణభాస్కర పాఠకులకు మనవి !

రమణభాస్కర పత్రికకు అడ్రస్సు సరిగ్గా ఇవ్వనికారణంగా చాలా పుస్తకాలు తిరిగి వచ్చుచున్నవి. రమణభాస్కర అందకపోయిన, మీ అడ్రస్సు మారిన, వెంటనే మీ పేరు ముందు ఉన్న నెంబరును వ్రాస్తూ డోర్ నెంబరు, వీధిపేరు, ఏరియా, పిన్‌కోడ్‌తో సహా సరియైన పూర్తి చిరునామాతో రిప్లై కార్డు వ్రాయండి. వెంటనే పంపబడతాయి.